నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్త అవాస్తవం

నవతెలంగాణ-కామారెడ్డి

మిషన్ భగీరథ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా కామారెడ్డిలో ఆరేపాక ప్రభాకర్‌రావు సోమవారం భాద్యతలు తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాలలో వస్తున్న వార్త అవాస్తవమని మిషన్ భగీరథ ఈఈ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు ఒకరే ఎస్.ఈ ఉంటారని పేర్కొన్నారు. కార్యాలయం కూడా నిజామాబాద్‌లోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎస్.ఈగా రాజేంద్రకుమార్ పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. కాగా సామాజిక మాధ్యమంలో ఆరేపాక ప్రభాకర్‌రావు సిద్దిపేట జిల్లా మేనేజర్ నుంచి ఎస్.ఈగా పదోన్నతి పొంది చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ సమక్షంలో భాద్యతలు స్వీకరించారని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుందని పేర్కొన్నారు. కాగా మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్‌గా రామచంద్రం కొనసాగుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథలో మేనేజర్ పదవే లేదని రమేష్ స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా నల్లాల కనెక్షన్ కోసం పరిశ్రమలు, విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ కాలనీలు, ప్రైవేట్ ఆర్గనైజేషన్లు http://missionbhagiratha.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారని, ఇది పూర్తిగా అవాస్తవమని ప్రజలు, అధికారులు గమనించాలని రమేష్ కోరారు.

వైభవంగా ఎల్లమ్మకు బోనాల పండుగ

నవతెలంగాణ-దోమకొండ


బోనాలతో వస్తున్న మహిళలు

మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఆలయం కమిటీ అధ్యక్షులు నాగభూషణంగౌడ్, కమిటీ సభ్యులు, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారికి బుధవారం మహిళలు బోనాలు సమర్పించి పలు ప్రతేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు సుదర్శన్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, భూమాగౌడ్, తదితరులున్నారు.

కూలీల దండు..

నవతెలంగాణ-బోధన్


చెరువులో చీమల దండులా ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలు

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులు జాతరల కొనసాగుతున్నాయి. దాంతో కూలీలు ఉదయం పూటనే పలుగు, పారతో ఉపాధిహామీ పనులకు వెళ్లి పనులలో నిమగ్నమవుతున్నారు. బుధవారం సాలూర పిల్లకుంట చెరువులో ఉపాధి హామీ కూలీలు చెరువు పూడికతీత పనులలో వందల మంది నిమగ్నమయ్యారు. ఆ దృశ్యాన్ని చూసిన వారికి ఇది చీమలదండా? కూలీల దండునా? అనే సందేహం కలుగకమానదు. వందల మంది కూలీలు దండుగా మారి పూడికతీత పనులు చేస్తుండడంతో నవతెలంగాణ క్లిక్ మనిపించింది.

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- డిపిఓ శ్రీనివాసరావు

నవతెలంగాణ-భిక్కనూర్


మాట్లాడుతున్న డిపిఓ శ్రీనివాసరావు

ఉపాధి హామీ పనులలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం భిక్కనూర్ పట్టణంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిపిఓ మాట్లాడుతూ.. గ్రామాలలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ కూలీ పని కల్పించే విధంగా చూడాలన్నారు. ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని వివరించారు. గ్రామంలో 100శాతం ఇంటి పన్ను వసూలు అయ్యేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో రాధిక, ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

అమ్మో ఇంత పిరెమా..?

- ఆకాశన్నంటిన మిర్చి, అల్లం, వెల్లుల్లి ధరలు
- మామిడి పచ్చళ్ల తయారీపై ప్రభావం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



మార్కెట్‌లో ఏ వస్తువు ధర చూసినా.. రూ.20 నుంచి 30 ఎక్కువగానే అమ్ముతున్నారు వ్యాపారులు. కొందరు కృత్రిమ కొరత సృష్టించి మరీ రేట్లు పెంచేస్తున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ తదితర మండలాల్లో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మామిడి పంట చేతికొచ్చాక జనాలు పచ్చళ్లు చేసుకోవడంపై దృష్టి సారిస్తారు. మిర్చి, అల్లం, వెల్లుల్లి, వంట నూనె ధరలు చుక్కలనంటుతుండంతో పచ్చడి చేసుకోవడానికి సాధారణ జనాలు జంకుతున్నారు. మామిడికాయ పచ్చడి చేసుకోవడానికి ప్రధానంగా అల్లం, వెల్లుల్లి, కారంపొడి అవసరం. గత సంవత్సరం అల్లం, వెల్లుల్లి ధరలు కిలో రూ.100 నుంచి 120 వరకు ఉండగా, ప్రస్తుతం వెల్లుల్లి కిలో రూ.240, అల్లం నాణ్యమైనది రూ.140 చొప్పున విక్రయిస్తున్నారు. పచ్చళ్లకు వినియోగించే కారం పొడి కిలో రూ.600 వరకు ఉంది. నువ్వులు, ఆవాల ధరలు కూడా గతంలో కంటే పెరిగాయి. ఈ సంవత్సరం మామిడికాత ఆశాజనకంగా కాసినప్పటికీ, ఎండల తీవ్రత వల్ల మామిడి కాయలు దెబ్బతినడంతో నాణ్యమైన కాయలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని గురువారం బాన్సువాడ, మంగళవారం బీర్కూర్, వర్ని, బుధవారం నసురుల్లాబాద్‌లో భారీ సంత జరుగుతుంది. సంత మార్కెట్లో మామిడి పచ్చడి కాయలు సైజును బట్టి రూ.8 నుంచి 10 వరకు విక్రయిస్తున్నారు. వాటిని ముక్కలుగా చేసుకోవడానికి ఒక్కో కాయకు రూ.5 చొప్పున తీసుకుంటున్నారు. గుజ్జు కాయలు కిలో రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. ఎండాకాలంలో మామిడి కాయలతో పచ్చళ్లు చేసుకొని ఏడాది పాటు తినడానికి జనాలు ఆసక్తి చూపుతారు. ఈ సంవత్సరం పచ్చళ్లు తయారు చేసుకోవడానికి అవసరమైన అన్ని సరుకుల ధరలు చుక్కలనంటడంతో వాటి తయారీకి ప్రజలు భయపడుతున్నారు.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, మిగిలిన ధాన్యాన్ని శనివారం లోపు అన్‌లోడింగ్ చేసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైస్‌మిల్లర్లను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌తో కలిసి సమీక్షిస్తూ జిల్లాలో 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని అన్నారు. ఇంకా 30,137 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే మిగిలి ఉందని అన్నారు. మిల్లుల సామర్థ్యం ఎంత, ఎంత ధాన్యం దించుకున్నారో రాష్ట్రస్థాయి విజిలెన్సు బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నామని, వారికి అవకాశం ఇవ్వకుండా త్వరితగతిన ఆ ధాన్యాన్ని దించుకోవాలని రైస్‌మిల్లర్లను కోరారు. తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్లు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులను సమన్వయం చేసుకుంటూ లారీలలో ధాన్యం లోడింగ్ చేసి పంపుతారని తెలిపారు. మిల్లులలో స్థలాభావం ఉంటే గోదాముల సర్దుబాటు అవకాశం ఉన్న దగ్గర ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. లక్ష్యం మేరకు ధాన్యం అన్‌లోడ్ చేసుకున్న మిల్లులకే వచ్చే ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయిస్తామని, ఇది గుర్తెరిగి త్వరితగతిన ధాన్యం దించుకోవాలని, జిల్లాకు చెడ్డ పేరు తీసుకురావొద్దని అన్నారు. బాన్సువాడ డివిజన్‌లోని కోమలంచ, అచ్చంపేట తదితర ప్రాంతాలలో 5,700 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, డివిజన్‌లోని 11 రైస్‌మిల్లర్లు 500 మెట్రిక్ టన్నుల చొప్పున శనివారం వరకు ధాన్యం దించుకోవాలన్నారు. రైతులు కూడా నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా ధాన్యం తేవాలని కోరారు. వాతావరణం పొడిగా ఉన్నందున కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని వెంటనే తూకం వేసి ట్యాగింగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి..

రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రాష్ట్ర రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ సింధు శర్మతో కలిసి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతూ మానవ తప్పిదాలు, రోడ్డు నిర్మాణంలో కొన్ని లోపాల వల్ల ప్రమాదాలు జరుగుతూ మృత్యువాత పడుతుండడం బాధకరమన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధలను పాటించేలా చూడాలని అన్నారు. జిల్లాలో జాతీయ రహదారి 60 కిలోమీటర్ల మేర ఉందని, దగ్గి, సదాశివ నగర్, భిక్కనూర్ టోల్‌ప్లాజా, ఆర్టీఏ చెక్‌పోస్ట్, టేక్రియాల్ తదితర ప్రాంతాలలో తరచుగా రోడ్డు ప్రమాదాల వల్ల మృత్యువాత పడుతున్నారని అన్నారు. గత సంవత్సరం జిల్లాలో 550 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాలకు గల కారణాలను క్షుణ్ణంగా తెలుసుకొని, నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా బ్లాక్ స్పాట్‌లను గుర్తించడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు, రుంబుల్ స్ట్రిప్స్, బ్యారికేడింగ్, స్టడ్స్, బ్లింకర్స్, కల్వర్టుల వద్ద రేడియం స్టిక్కర్లు, మలుపుల వద్ద సూచిక బోర్డులు, బాణం గుర్తులు, స్పీడ్ గన్‌లు, సి.సి.కెమెరాలు, హైమాక్స్ లైట్లు వంటివి ఏర్పాటు ప్రాంతాలను గుర్తించి తగు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. బైపాస్ రోడ్డు నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే మార్గంలో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని, అత్యవసర సమయంలో వాహనాలు రహదారి పక్కన ఆపడానికి తగు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రమాదం జరిగిన గంట సమయం గోల్డెన్ పీరియడ్ అని, తక్షణ వైద్య సహాయం అందేలా చూడాలని అన్నారు. వెంటిలేటర్‌తో అంబులెన్స్ సిద్ధంగా ఉండాలని, ఆసుపత్రిలో అత్యవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో బాధితులకు సహాయం చేయాలని, 108 అంబులెన్స్‌కు కాల్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ కాజల్, డిఎస్పీ నాగేశ్వర్‌రావు, నేషనల్ హైవే రెసిడెంట్ ఇంజనీర్ రామారావు, టోల్ గేట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ్‌సింగ్, సేవ్ లైఫ్ ఫౌండేషన్ సీనియర్ అసోసియేట్ నూర్ ఖేతార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ..

అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. డాక్టర్ భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఎస్సి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని అన్నారు. సమాజ నిర్మాణానికి అవిరళ కృషిసల్పిన మహనీయుడు భాగ్యరెడ్డి అని అట్టి మహనీయుల జీవిత చరిత్రను బాలబాలికలకు తెలియచెప్పాలని, వారి ఆశలు, ఆశయాలకనుగుణంగా ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారి రజిత, ఎస్సి కార్పొరేషన్ ఈడి దయానంద్, గిరిజనాభివృధికారి అంబాజీ, సిపిఒ రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, పలువురు

పారిశుధ్య నిర్వహణపై సెక్రెటరీలు శ్రద్ధ వహించాలి

- ఎంపీఓ బ్రహ్మం
- పారిశుధ్య పనులు పరిశీలన


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ

నవతెలంగాణ-పిట్లం

పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ సెక్రటరీలు శ్రద్ధ వహించాలని మండల ఎంపిఓ బ్రహ్మం అన్నారు. బుధవారం మండలంలోని మద్దెల్ చెరువు గ్రామంలో ప్రైవేటు వ్యక్తులచే చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల ఆయా వార్డులలో చెత్తాచెదారం, మురికి కాలువలను ఎప్పటికప్పుడు పరి శుభ్రపరచాలని సూచించారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ కవర్‌లను ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నిషేధించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూతో మృతిచెందిన బాలుడి ఇంటి సందర్శన

- వివరాలు సేకరించిన వైద్యులు


వివరాలు సేకరిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పేలల కృష్ణ కుమారుడు మణిదీప్ (11) డెంగ్యూ వ్యాధి సోకి కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఈనెల 21న మృతి చెందిన విషయం తెలుసుకొని బుధవారం ఎల్లారెడ్డి డిప్యూటీ డిఎంహెచ్వో శోభారాణి సహచర వైద్య బృందంతో కలిసి ఎల్లారెడ్డిలోని వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అన్నారు. ఆ ఇంటి చుట్టుపక్కల 50 ఇండ్లను సర్వే చేసి వారి నుంచి రక్తపు నమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశారు. ఆ వీధిలో నేడు (గురువారం) ఆరోగ్య శిబిరం కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని రోగాల బారిన పడకుండా ఉండాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మత్తమాల పి.హెచ్.సి వైద్యులు డాక్టర్ శరత్, సూపర్వైజర్ రాణి, ఆరోగ్య కార్యకర్త ఇందిరా, ఆశావర్కర్ సంధ్యా, విజయ, ఆరోగ్య బోధకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్వహణ సక్రమంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్
- సాలూరా పిహెచ్‌సీ, సబ్ సెంటర్లు ఆకస్మిక తనిఖీ
- వైద్యాధికారి తనిఖీలోనూ వెలుగుచూసిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

నవతెలంగాణ-బోధన్


పీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న వైద్యాధికారి

ఆస్పత్రి నిర్వహణ, సబ్ సెంటర్లలో నిర్వహణ సక్రమంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన బుధవారం సాలురా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, సమయపాలన పాటించాలని, అలాగే రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలు సరిచూసుకోవాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి సాలూరా మండలంలోని పెంటాఖుర్దు సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సబ్ సెంటర్లోని మందులు వివరాలు రికార్డులు పరిశీలించారు. అక్కడి సిబ్బంది సైతం ఆయన వచ్చిన తర్వాతనే విధులకు ఆలస్యంగా హాజరవ్వడం గమనార్హం. అలాగే కుమ్మన్‌పల్లిలో వ్యాక్సినేషన్ జరిగే విధానాన్ని పరిశీలించారు. కుమ్మన్‌పల్లి సబ్‌సెంటర్‌లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం ఆయన సాలుర సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సబ్‌సెంటర్లో వ్యాక్సినేషన్ల గడువు, నిలువ చేసిన విధానం, చిన్నారులకు టీకాలు ఎన్ని వారాల వరకు ఇస్తున్నారని ఏఎన్ఎం నందకుమారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే టీకాల నిలువ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం సాలుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని రోగులకు వైద్యం అందిస్తున్న తీరును పరిశీలించారు. రోగులకు వైద్యం అందిస్తున్న పడకలపై తెల్లని వస్త్రాలు వేయవలసి ఉన్నా.. వైద్య సిబ్బంది దానిని వేయకుండా నిర్లక్ష్యంగా అలానే వైద్యం అందిస్తున్న తీరు వెలుగు చూసింది. అలాగే కుక్కకాటుకు అందించవలసిన వ్యాక్సిన్ వాటి వివరాలను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓ వ్యాక్సిన్‌ను కావలసిన ఉష్ణోగ్రతల వరకు ఫ్రిజ్‌లో నిల్వ చేయకుండా బయట నిల్వ చేయడంపై ఆయన సిబ్బందిని మందలించారు. రోగులు ఉపయోగించే మరుగుదొడ్లను, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్లో సైతం నిర్లక్ష్యంగా వస్తువులు ఉంచడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అలాగే నెలలో ఎన్ని కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నారని సూపర్వైజర్ ఇందిరాను ప్రశ్నించారు. దానికి సంబంధించిన రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అందులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు లక్ష్యానికి అనుగుణంగా చేయకపోవడంపై సూపర్వైజర్ ఇందిరాను నిలదీశారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం కుటుంబ నియంత్రణ ప్రోత్సహించాలని, లక్ష్యానికి అనుగుణంగా కు.ని ఆపరేషన్‌లు చేయాలని ఆమెను ఆదేశించారు. అనంతరం పెగాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య, సిబ్బంది నిర్మల, రవి తదితరులున్నారు.

రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-ఆర్మూర్

ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. మండలంలోని ఫత్తేపూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తూ తుది దశకు చేర్చారని అన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరపాలని అధికారులకు సూచించారు. ఆలస్యంగా పంట దిగుబడులు చేతికి అందిన ప్రాంతాల్లో ఇంకనూ సుమారు 23 చోట్ల కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్‌మిల్లులకు పంపించాలని, ఆర్.ఐలను నియమించి మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. అవసరమైతే లారీల సంఖ్యను పెంచాలని, ఇప్పటికే ధాన్యం సేకరణ పూర్తయిన కేంద్రాలలో పనిచేసిన హమాలీల సేవలను అవసరమైన కేంద్రాలలో వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలను పూర్తి చేయాలని, తద్వారా రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుగుతాయని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజాగౌడ్, డీఎస్ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీశ్, డీసీఓ శ్రీనివాస్ తహసిల్దార్ గజానన్ తదితరులున్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవల్లో అర్బన్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇందూరు నగరంలోని 6వ డివిజన్ వినాయక్ నగర్‌లో లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ సూర్యనారాయణ గుప్తా హజరై స్వామి వారి ప్రతేక పూజ, కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కులచారి సంతోష్, భూమేష్, భాస్కర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు చిత్రపటానికి నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం తెలంగాణ వైతాళికుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 136 జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ గంట సదానందం, ఆల్ ఇండియా మాల స్టూడెంట్ అస్సోసి అధ్యక్షులు ప్రదీప్, మూగ ప్రభాకర్, కార్మిక సంఘ నాయకులు పింజా అశోక్, శెట్పల్లి నారాయణ, అంబెడ్కర్ మాల సంఘం అధ్యక్షులు పింజా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో వివిధ కేసుల్లో నమోదు అయిన మూడు వాహనాలను ఈనెల 24 శుక్రవారం వేలం వేయనున్నట్టు పట్టణ ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ బుధవారం తెలిపారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆదేశానుసారం జరిగే ఈ వాహనాల వేలంలో పాల్గొనే వారు 25 శాతం అదనపు ప్రైస్ జమచేసి పాల్గొనాలని ఆయన కోరారు.

ఆదర్శ రైతు.. రాంపూర్ మాజీ సర్పంచ్

- మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ



రైతును సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని రాంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బంటు దయానంద్ ఆదర్శ రైతు అని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ అన్నారు. ఆయన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఫార్మా జీన్ కంపెనీ సామర్ అనే వెరైటీ విత్తనాలతో అధిక దిగుబడిని సాధించిన టమాట పంటను పరిశీలించారు. 45 డిగ్రీల ఎండలు ఉన్నప్పటికీ ఈ టమాట పంట అధిక దిగుబడి సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని సన్మానించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ,ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్, ఇస్సపల్లి, పి ఫ్రీ ఖానాపూర్, దేగాం, మిర్ధాపల్లి గ్రామాల మాజీ సర్పంచులు దార్ల రాజు, ఆశాపురం దేవి శ్రీనివాస్ రెడ్డి ,,సింగిరెడ్డి మోహన్ ,గడ్డం గంగారెడ్డి, మధువర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మొరం దందా

- కన్నెత్తి చూడని అధికారులు



అక్రమంగా తరలిస్తున్న మొరం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని దేగాం, మచ్చర్ల, పలు గ్రామాలలో చెరువుల నుండి మొరం మట్టి తీస్తున్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా రైతుల పేరు చెప్పి వీడీసీలు డబ్బులు వసూలు చేస్తూ వందల ట్రాక్టర్లతో చెరువుల నుండి మొరం మట్టిని తరలిస్తున్నారు. వేసవి కాలం అవ్వడంతో చెరువులు పూర్తిగా ఎండిపోయే స్థితికి చేరాయి. అదే అదునుగా భావించిన గ్రామాలలోని వీడీసీలు చెరువులోని మట్టిని మొరంను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించకుండా అటు రెవెన్యూ అధికారుల నుండి "ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా మొరం తోడేస్తున్నారు. వందల ట్రాక్టర్లు పదుల సంఖ్యలో జెసిబిలు పెట్టి ట్రాక్టర్లు నడుస్తున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనక పలు అనుమానాలకు తావిస్తోంది. ఏది ఏమైనప్పటికీ చెరువు చుట్టూ ఉన్న రైతులు లబోదిబోమంటున్నారు. భూగర్భ జలాలు పాతాళానికి వెళ్ళిపోయి అవస్థలు పడుతుంటే ఇంకా మొరం తీయడంతో పూర్తిగా జలాలు అట్ట అడుక్కు వెళ్లిపోయి పంట సాగుకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆవేదన వెళ్లబోసుకుంటున్నారు. ఇటు తాగునీటికి కూడా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని గ్రామ ప్రజలు కూడా అసహనంతో ఉన్నారు. మొరం మట్టితో ట్రాక్టర్లు నడవడంతో ఆర్అండ్‌బి వేసిన రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. వాటిని పట్టించుకున్న నాథుడు లేడు. రోడ్లు చెడిపోతే వచ్చేది వర్షాకాలం వాహనాలు నడవడానికి ప్రజలు ప్రయాణాలు చేయడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు వెళ్లి మొరం తవ్వకాలను నిలిపి వేయవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.

కబడ్డీ క్యాంపు సందర్శించిన జాతీయ క్రీడాకారులు



కబడ్డీ సమ్మర్ క్యాంపును సందర్శించిన జాతీయ స్థాయి క్రీడాకారులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో జరుగుతున్న జూనియర్, సబ్ జూనియర్ 'కబడ్డీ సమ్మర్ క్యాంపు'ను బుధవారం జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులు స`ందర్శించడం జరి గిందని జిల్లా కబడ్డీ అసో సియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి తెలిపారు. క్యాంపులో శిక్షణా పొందుతున్న క్రీడాకారులకు కబడ్డీ నైపుణ్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జాతీయ కబడ్డీ క్రీడాకారులు ఏలేటి గంగాధర్, ఏలేటి రాములు, లోక ముత్యం, గంగాధర్, ప్రదీప్, ముస్కు శ్రీనివాస్, లోక సుభాష్. ఏలేటి విజయ్, మల్లారెడ్డి, ప్రశాంత్, బద్దం హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు జాన్తానై


- యథేచ్ఛగా నల్లమట్టి తరలింపు
- 'మామూలు'గా చూస్తున్న అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



నల్ల మట్టిని తరలిస్తున్న లారీలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

చెరువుల్లోని నల్ల మట్టిని నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు తమ కెందుకులే అన్నట్లుగా పట్టించు కోకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా రాత్రి, పగలూ తేడా లేకుండా తమ దందాను కొనసాగి స్తున్నారు. అధికార పార్టీ నాయకులు, అదికారుల అండదండల తోనే ఈ దందా కొనసాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలువురు ఫిర్యాదులు చేసినా సంబంధిత శాఖ అధికారులు, అధికార యంత్రాంగం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిచ్ పల్లి మండలంలోని బర్దిపూర్ ధర్మారం, సుద్దపల్లితోపాటు తదితర గ్రామాల్లో చిన్న చితకా కలుపుకుని దాదాపు 10 నుండి 20 వరకు ఇటుక బట్టీలు ఉన్నట్లు సమాచారం. నల్లమట్టిని ప్రతి వేసవిలో చెరువుల్లో నుంచి తరలించి ఏడాదికి సరిపడా నిల్వలను సిద్ధం చేసుకుంటారు. అధికార యంత్రాంగం కార్యాలయాలకే పరిమితం కావడంతో ఇక్కడ వ్యాపారులు యథేచ్ఛగా మట్టి దందాకు తెరలేపారనేది అక్షర సత్యం. ప్రస్తుతం మండలంలోని పెద్దది కోణం చెరువు. ఆ చెరువు నుంచి నల్లమట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. అధికార పార్టీ, అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో తమకు ఎవరు ఏమి చెయ్యరనే ధీమాలో ఉంటు అందిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఇటుకల బట్టీల వ్యాపారులు కొన్ని రోజులుగా టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. చెరువులో పెద్ద జేసీబీలతో రాత్రి, పగలు తరలిస్తూ రాంగ్ రూట్‌లో టిప్పర్లు అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ దందాను యథచ్ఛగా కొనగిస్తున్నారు. టిప్పర్ డ్రైవర్లు మద్యం సేవించి అదే మత్తులో అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి స్తుండటంతో నిజామాబాద్, హైదరాబాద్ రాహదరిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ సంఘటన చోటు చేసుకుంటుందోననే ఆందోళనలో వాహనదారులు, ప్రజలు ఉన్నారు. డిచ్ పల్లి మండలంలోని బర్దిపూర్, అమృత పూర్, మెంట్రాజ్ పల్లి, దూస్‌గాం, ఖిల్లా డిచ్‌పల్లి, బీబీపూర్, సుద్ద పల్లి తోపాటు ఆయా గ్రామాల శివారు ప్రాంతాల నుండి ప్రభుత్వ భూములు, చెరువులనుండి యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని ముడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగించు కుంటున్నాను. శనివారం, ఆదివారం , మిగిలిన సెలవు రోజుల్లో మండలంలో ఏ అధికారి కుడా అందుబాటులో ఉండరనే ధీమాతోనే అక్రమ రవాణా చేస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కొందరు అధికారులకు ప్రతి వెంచర్, ఇటుకల బట్టిల నుండి మూముళ్ళు అందుతుండటంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు, ఆరోపణలు లేకపోలేదు. ఎవరైనా ఎదిరించిన , ఎవరికి తెలియకుండా అదికారులకు సమాచారం అందజేసిన చర్యలు మాత్రం తీసుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచాల్సి ఉండగా తమకు సమాచారం ఎప్పుడూ వచ్చింది. ఎవరు ఇచ్చారు.పూర్తి వివరాలను వారికి అందజేస్తున్నారని, సమాచారం ఇచ్చిన వ్యక్తికి ఫోన్‌చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కొందరు తెలిపారు. ఇటుకల బట్టిలు, నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ వెంచర్ యజమానులు ప్రభుత్వం నుండి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కాని అలా చేయకుండా నజరానాలకు ఆశపడి ప్రభుత్వ ఆదాయానికి గండి చేస్తున్నారు. ఇదంత తంతంగం అధికారులకు తెలిసె జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇదే కాకుండా ఈ వ్యాపారం చేసే వారు రాజకీయ నాయకులు కావడంతో చేసేదేమీ లేక తమకు ముడుపులు ఇచ్చిన మేరకు సంతృప్తి చెందుతున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



మండలంలోనే అతి పెద్ద చెరువులో కోణం చెరువు ఒకటి. ఏ మూలన చూసిన పెద్ద జెసిబిలతో పెద్ద పెద్ద గుంతలు చేసి వదిలేసినట్లు కనబడుతోంది. ఇంకొందరు పొలాల్లోకి మట్టి తరలిస్తున్నామని రైతుల పేర్లు చెప్పుకుని ఇటుక బట్టిలకు, ప్రైవేట్ వెంచర్లకు అమ్ముకుంటున్నారు మట్టి వ్యాపారులు. ఇరిగేషన్ శాఖ అధికారులు పెలల తరబడి చెరువుల వైపు కన్నెత్తి చూడటం లేదని, మట్టి ఇంత పెద్ద ఎత్తున తరలి పోతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు కాని, రెవెన్యూ అధికారులు సైతం చోద్యం చూస్తూన్నరే తప్ప పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రోజు వందల ట్రిప్పులు అమ్ముకుంటున్న అడిగే నాథుడే కరువయ్యారని అంటున్నారు. అధికారులు అయితే అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి నల్లమట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని, ఈ వ్యాపారం పై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు, స్థానికులు కోరుతున్నారు.

అంటి ముట్టనట్లు రవాణా శాఖ..

ఇంత జరుగుతున్నా ఒక వాహనం రహదారిపైకి వస్తే రవాణా శాఖ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కాని టిప్పర్లు, ట్రాక్టర్లలో నల్లమట్టి తరలించుకుని రాకపోకలు సాగించే సమయంలో నల్ల మట్టి అ వాహనం పై నుండి జారుతూ రోడ్డుపై పడుతుంది. చిన్నపాటి చినుకులు పడ్డప్పుడు ద్విచక్ర వాహనాలు, ఆటోలు బోల్తా పడుతున్నాయి. ఆ వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు రాకపోకలు సాగించు కుంటున్నాను. దీనిని పర్యవేక్షించవల్సిన రవాణా శాఖ అధికారులు తమ కేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, రవాణా శాఖ నియమ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమమే నాయకత్వ లక్ష్యం కావాలి

- ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కార్మికుల సంక్షేమమే నూతన నాయకత్వ లక్ష్యం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై .ఓమయ్య అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో మర్చంట్ అసోసియేషన్ హాల్ నందు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన హమాలీ యూనియన్ నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, మార్కెట్ యార్డ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకటేశం హాజరై నూతనంగా ఎన్నికైన నాయకత్వంతో ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి కార్మికులు కంకణ బద్ధులై పనిచేయాలని అన్నారు. సంవత్సరానికి 10 నెలలు నడిచే వ్యవసాయ మార్కెట్ రెండు నెలలు కూడా నడవకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలని, రైతుకు భరోసా కల్పిస్తూ మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకురావడం ద్వారా గిట్టుబాటు ధర రావటంతో పాటు రైతు పండించిన ధాన్యానికి గ్యారెంటీ ఉంటుందనే భరోసాను కల్పించాలని అన్నారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని, అది కార్మికులు అధికారులు రైతుల సంక్షేమం కోసం ఉపయోగపడుతుందని అన్నారు. ఏఐటీయూసీగా నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తామని కార్మికుల లైసెన్సుల పునరుద్ధరణ, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపు, శ్రమకు తగ్గ ప్రతిఫలం పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటి చట్టాల అమలు తోపాటు గత ప్రభుత్వ హామీలో భాగంగా కార్మికుల పిల్లల చదువులకు సహకారం అందించడం కోసం ఐక్యమత్యంతో కార్మికులు పనిచేయాలని కోరారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని మార్కెట్ యార్డుకు చెడ్డ పేరు రాకుండా మీరంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ కిషోర్ ఇనాని కార్యదర్శి మల్లేష్ స్థానిక కార్పొరేటర్లు హమాలీ యూనియన్ నూతన అధ్యక్షులు ఎం. పరుశురాం, కార్యదర్శి శ్రీహరి, ఉపాధ్యక్షులు ఎన్. సుధాకర్ ,కోశాధికారి టి. నరేష్ నాయకులు కిషన్ గౌడ్, వెంకట్, దడువాయి గుమస్తా సంఘం చాట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు నూతనంగా ఎన్నికైన నాయకులకు ఘనంగా సత్కరించి అభినందించారు.



మాట్లాడుతున్న ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రేమించిన యువతి.. పెండ్లికి నిరాకరణ

- యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గాఢంగా ప్రేమించిన ఓ యువతి పెళ్ళికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో ఈ సంఘటన కలకలం రేపుతుంది. వివరాల్లోకి వెళ్తే నగరంలోని అరుంధతి నగర్ కాలనీకి చెందిన 24 సంవత్సరాల వయసు గల ప్రమోద్ కుమార్ పెయింటర్‌గా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఆ యువకుడు గత కొన్ని రోజులుగా అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. తీరా యువకుడు ఆ యువతిని పెళ్లి చేసుకోవాలంటూ తరచుగా ప్రస్తావన తేవడంతో పెళ్లికి ప్రేమికురాలు నిరాకరించడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో ఆ యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానిక 3 టౌన్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో యువకుని కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

24న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు 24న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఈఓ సుందర వరదరాజన్ ఆధ్వర్యంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికకు మండలంలోని మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

60 శాతం రాయితీపై జీలుగా విత్తనాలు

- భీంగల్ ఏడిఏ మల్లయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతులకు 60శాతం రాయితీపై జీలుగ విత్తనాలను అందిస్తున్నట్లు భీంగల్ ఏడిఏ మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని కమ్మర్ పల్లి సింగిల్ విండో పరిధిలోని ఉప్లూర్, కమ్మర్ పల్లి గ్రామాల్లో సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట జీలుగా విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మల్లయ్య మాట్లాడుతూ పచ్చి రొట్ట జీలుగా పైరు సాగు చేయడం వలన చౌడు నేలలను పునరుద్ధరించుకొని, ఆ నేలల ఉత్పాదకతను పెంచుకోవచ్చు అన్నారు. జీలుగా పైరు వలన నేల భౌతిక స్థితి మెరుగుపడి నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట జీలుగు విత్తనాలను తొలకరి జల్లులకు పొలంలో విత్తుకొని 50 శాతం పూత దశలో భూమిలో కలియదున్నాలని సూచించారు. ఆ సమయంలో పొలంలో ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ చల్లితే త్వరగా కుళ్లిపోయి ఎరువుగా మారుతుందన్నారు. జీలుగ పంట చౌడు భూములు, వరి పండించే భూములకు బాగా అనుకూలమని తెలిపారు. ఎకరానికి 12 నుంచి 15 కిలోల జీలుగా విత్తడం వలన 8 నుంచి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుందన్నారు. అంతేకాకుండా ఒక టన్ను పచ్చిరొట్ట ఎరువులో ఆరు కిలోల నత్రజని, ఒకటి నుండి ఒకటిన్నర కిలోల భాస్వరం, పొటాషియం భూమిలో స్థిరీకరించబడుతా యన్నారు. జీలుగు విత్తనాలు అవసరమైన రైతులు తమ భూమి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకువచ్చి రాయితీ విత్తనాలను పొందాలని సూచించారు. 30 కిలోల జీలగ బస్తా పూర్తి ధర 2790 రూపాయలు ఉండగా 60శాతం రాయితీపై 1116 రూపాయలకే రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని బద్దం లావణ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కావ్య, పద్మ సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్, విండో కార్యదర్శి శంకర్, రైతులు అవారి గంగారెడ్డి, హరీష్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మోర్తాడ్: జీలుగా విత్తనాలు పంపిణీ చేస్తున్న పలువురు



కమ్మర్‌పల్లిలో...

మోర్తాడ్: మోర్తాడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో రాయితీపై రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిని లావణ్య బుధవారం తెలిపారు. 30 కేజీల బస్తా 60 శాతం రాయితీపై 1116 రూపాయలకు రైతులకు అందిస్తున్నామని ఆసక్తిగల రైతులు ఆధార్ కార్డు పాస్ బుక్ లో జీలుగ విత్తనాలను తీసుకెళ్లాలని అన్నారు. జీలుగా సాగవలన భౌతిక స్థితి మెరుగుపడి నేలకు నీటిని పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందని, పచ్చిరొట్ట జీలుగ పైరును పూత దశలో కలియ దున్నడం వల్ల భూ సాంద్రత పెరుగుతుందని అన్నారు. ఎకరానికి 12 నుండి 15 కిలోల జీలుగ విత్తనాలు అవసరం ఉంటాయని ఏవో తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి కాశీరాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని రాఘవేంద్ర దీప్తి మెమోరియల్ కోటగి లయన్స్ భవన్‌లో బుధవారం లయన్స్ క్లబ్ బోధన్ వారి చేయూతతో 25 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మూడు గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని లయన్స్ క్లబ్ సభ్యులు హనుమంతరావు తెలిపారు. డాక్టర్ సతీష్ మాట్లాడుతూ.. మోతి బిందువు ఉన్న వారిని గుర్తించి బోధన్ లయన్స్ ఆసుపత్రికి రిఫర్ చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కోటగిరి ఉమ్మడి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయన సభ్యులు అనిల్ కుమార్, ఆరోగ్య సిబ్బంది సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

సిద్ధరామేశ్వర ఆలయంలో చతుర్వేద పారాయణం


పారాయణం చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని దక్షిణకాశి శ్రీసిద్ధ రామేశ్వర ఆలయంలో బుధవారం భిక్కనూర్ పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాస్తు హెూమ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఉడిపి పూజారుల చేత చతుర్వేద పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తు హెూమ కార్యక్రమాలు 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, ఆలయ పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి

- గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పేకాట, జూదం, తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి
- పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి ఆరా
- నెలవారీ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పి సింధుశర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సింధుశర్మ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగులు, జూదం, మట్కా లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.

జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి (బ్లాక్ స్పాట్స్), వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

విధుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని గుర్తించి వారికి ఎస్పీ అవార్డులు అందజేశారు. సమావేశంలో ట్రైనింగ్ ఐపీఎస్ కాజోల్ సింగ్, డిఎస్‌పిలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఎస్బి ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మురళి, సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రాజమ్మ తాండకు చెందిన భూక్య లావణ్య అనారోగ్యంతో ఆపరేషన్ చేయవలసి ఉండగా, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో, వెంటనే స్పందించి రూ.4లక్షల ఎల్‌వోసి చెక్కును అందజేశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు మదన్ మోహన్‌రావు సూచించారు. బాధిత కుటుంబం మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ దరఖాస్తులకు 25 వరకు గడువు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకై దరఖాస్తు చివరి తేదీ ఈనెల 25వరకు ఉన్నట్టు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

శ్రీలక్ష్మీనారాయణ ఆలయం సందర్శన


సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని మద్నూర్ గ్రామపెద్దలు, వ్యాపారవేత శ్రీకాంత్ ఇనాని సెట్ బుధవారం సందర్శించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతు ఎల్లవేళలా కృషి చేస్తానని హినాని సెట్ ఆలయ కమిటీకి హామీనిచ్చారు. గ్రామాభివృద్ధికి ఎంతో కృషిచేసిన ఈనానికి శ్రీలక్ష్మీనారాయణకు ఆలయ కమిటీ చైర్మన్ సందూర్‌వార్ హనుమాన్లు, కమిటీ కోశాధికారి కంచివార్ నాగేష్, బిజెపి సీనియర్ నాయకులు కృష్ణ పటేల్, అవార్ హనుమాన్లు, అవార్ రాజు, ఆలయ సేవకులు బండి గంగారాం పాల్గొన్నారు.

మండలంలో సెంట్రల్ టీం సందర్శన


ఉపాధి పనులను సందర్శించిన సెంట్రల్ టీం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామపంచాయతీని సెంట్రల్ సెక్రటేరియట్ టీం (అనగా ఏఎస్ఓ ట్రైనింగ్) సందర్శించారు. వీరు గ్రామంలో నాలుగు రోజులపాటు సందర్శించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, మౌలిక వసతుల వివరాలను గ్రామస్తుల నుంచి సేకరించి పైఅధికారులకు అందజేయనున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గాయత్రి షుగర్ ఫ్యాక్టరీని సందర్శించి అక్కడ వివరాలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ మర్కల్‌లో ఏఈ ద్వారా పూర్తి వివరాలు సేకరించి తెలుసుకున్నారు. ధర్మారావుపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించి అక్కడ వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సంతోష్‌కుమార్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, ఏపీవో మధు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్మి కాంప్లెక్స్‌లో యూరియా తయారు చేయాలి

- మొక్కలు వాడిపోకుండా చూడాలి
- ఎంపీడీవో నరేష్


నర్సరిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీ పరిధిలోని నిర్మాణం చేపట్టిన వర్మి కంపోస్టులో ఎరువులను తయారు చేయాలని ఎంపీడీవో నరేష్ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండలంలోని ఎల్లారం, ఎల్లమ్మగడ్డ, జగదంబ తండా, సూరాయిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో వర్మి కంపోస్ట్, డంపింగ్ యార్డ్, నర్సరీలను ఆయన సందర్శించారు. హరితహారం కొరకు మొక్కలు వాడిపోకుండా చూడాలన్నారు. జూన్, జూలై మాసంలో హరితహారంలో మొక్కలు నాటాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మాణం చేపట్టిన వర్మి కంపోస్టులో ఎరువులు ఎందుకు తయారు చేయడం లేదని కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. కచ్చితంగా గ్రామ పంచాయతీల వారీగా కంపోస్టు ఎరువులను తయారు చేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లో చెత్తచెదారం డంపింగ్ యార్డ్‌లోకి తరలించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

ఉత్తమ సేవలు అందించిన షీటీం బృందానికి అవార్డు అందించిన ఎస్పీ


అవార్డును అందజేస్తున్న ఎస్పీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ ఠాణాలో షీటీం విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ సుప్రజతో పాటు కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన నెలవారి సమీక్ష సమావేశంలో ఉత్తమ సేవలందించిన వారిద్దరూ జిల్లా ఎస్పీ సింధు శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వారు తెలిపారు. అవార్డు అనుకున్న సుప్రజ, శ్రీనివాసుకు ఎల్లారెడ్డి పోలీసులతోపాటు పలువురు అభినందించారు.

పారిశుధ్య కార్మికుల పనితీరును తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం ఉదయం 5గంటలకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం వారి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో ఎక్కడ కూడా చెత్తాచెదారం మురికి ఉండకుండా తొలగించి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని అన్నారు. అందరూ సక్రమంగా పనిచేస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కార్మికులకు సూచించారు.

బోధన్ క్రీసెంట్ హైస్కూల్‌కు జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతంలో గల క్రీసెంట్ హైస్కూల్‌కు జాతీయస్థాయి ఉత్తమ పాఠశాల-2024 అవార్డు వచ్చిందని పాఠశాల కరస్పాండెంట్ జావెద్ అలీ బుధవారం తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన హై ఫ్లీడ్జ్ మీడియా గ్రూప్ 2024 ఏప్రిల్ 20న అవార్డుకు ఎంపిక చేసిందని ఆయన తెలిపారు. విద్యార్థులకు వినూత్న విధా నాల ద్వారా విద్యా బోధన, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. బుధవారం పోస్ట్ ద్వారా నిర్వాహకులు అవార్డును పంపించారని పాఠశాల కరస్పాండెంట్ జావీద్ అలీ తెలిపారు.

అనాలోచితంగా నాటిన హరితహారం మొక్కలు

- మొక్కలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

నవతెలంగాణ-నసురుల్లాబాద్

హరితహారంలో భాగంగా మొక్కల పెంపకాన్ని చేపడుతున్న అధికారులు ఎవెన్యూ ప్లాంటేషన్‌లో విద్యుత్ తీగల కింద మొక్కల్ని నాటుతుండడం విద్యుత్ అధికారులకు సమస్యగా మారుతున్నది. ఉమ్మడి బీర్కూర్, నసురుల్లాబాద్ మండలంలో 9 విడుతల్లో హరితహారాన్ని చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొక్కల పెంపకానికి నిర్దేశిత లక్ష్యం ఏర్పాటు చేయడంతో, విధిలేని పరిస్థితుల్లో అనాలోచితంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో రోడ్డుకిరువైపులా విద్యుత్ తీగల కింద మొక్కల్ని నాటి అధికారులు చేతులు దులుపుకున్నారు. మొక్కలు వృక్షాలుగా మారి విద్యుత్ తీగలకు కొమ్మలు తగులుతుండడంతో గాలిదుమారం వీచినప్పుడు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. నసురుల్లాబాద్ నుంచి లింగంపల్లి వెళ్లే రహదారిపై ఉన్న మొక్కలను తొలగించారు. బొమ్మన్ దేవ్‌పల్లి చౌరస్తా నుంచి బీర్కూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న హరితహారం మొక్కలను పెంపకాన్ని చేపట్టారు. గత వారం రోజులుగా ఈదురు గాలులు వర్షం రావడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతూ, విద్యుత్ అధికారులకు పెద్ద సమస్యగా మారడంతో చెట్ల కొమ్మల్ని తొలగిస్తున్నారు.


చెట్లకొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

బీర్కూర్ మండల కేంద్రంలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను, కొమ్మల్ని తొలగిస్తుండడంతో హరితహారంలో నాటిన మొక్కలు కనుమరుగవుతున్నాయి. వర్షాకాలానికి ముందే విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చెక్ పెట్టేందుకు, విద్యుత్ తీగల స్థానంలో కవర్ కండక్టర్ విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే వర్షాకాలంతో పాటు గాలిదుమారమప్పుడు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండి, ప్రజాదనం దుర్వినియోగమయ్యేది కాదని స్థానికులు అంటున్నారు. ఆ దిశలో విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని తెలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు మొక్కలు నాటేముందు తగు జాగ్రత్తలు తీసుకుని మొక్కలు నాటాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-దోమకొండ

తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన ట్యాగింగ్ చేసి మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. మండలంలోని ముత్యంపేట్, చింతామనుపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి ధాన్యంలో తేమశాతాన్ని కొలిచి, తూకం చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే తరలించాలని, రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు, నిర్వాహకులకు సూచించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన చేయాలని అధికారులకు సూచించారు. రైస్ మిల్లర్లు కూడా హమాలీలను ఎక్కువగా పెట్టుకొని లారీలు వచ్చిన వెంటనే 24 గంటలలోగా ధాన్యం దించుకోవాలని, ఎట్టిపరిస్థితులలో మిల్లుల వద్ద లారీలు వేచి ఉంచకూడదని తెలిపారు. త్వరగా దించుకుంటేనే తిరిగి లోడింగ్ చేయడానికి అవకాశాముంటుందని స్పష్టం చేశారు. తహసీల్దార్లు, అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. టార్పాలిన్లు, గన్నిసంచులు, లారీల సమస్య తలెత్తకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి రోజు కొనుగోళ్లు ఆగకుండా, రైస్‌మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా ఇబ్బందులైతే అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ తిరుపతిగౌడ్, తహసీల్దార్ సంజయ్‌రావు, సీఈఓ రాంచంద్రం తదితరులున్నారు.


వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

లారీలు ఏర్పాటు చేసి ధాన్యం తరలిస్తాం

- ఎమ్మార్వో నరేందర్

నవతెలంగాణ-లింగంపేట్

ధాన్యం తరలించడంలో జాప్యం జరగకుండా లారీల ఏర్పాటు చేసి దాన్యం సకాలంలో తరలిస్తామని ఎమ్మార్వో నరేందర్ అన్నారు. బుధవారం మండలంలోని కోర్పోల్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ధాన్యం తరలించడంలో జాప్యం జరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం రావడంతో సమాచారం మేరకు కొనుగోలు కేంద్రానికి వెళ్లి ఎంతమంది రైతులు ధాన్యం తూకం వేసి నిల్వ ఉంచారో అడిగి తెలుసుకున్నారు. 15 మంది రైతులకు చెందిన ధాన్యం అక్కడే నిల్వ ఉండడంతో రెండు రోజుల్లో ధాన్యాన్ని సంబంధిత రైస్‌మిల్లర్లకు తరలిస్తామని రైతులకు హామీనిచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.


మాట్లాడుతున్న ఎమ్మార్వో నరేందర్

ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన కార్తీక్ అనే యువకుడి నాన్న లంగ్స్ ప్రాబ్లంతో మెడికవర్ హాస్పి టల్‌లో చికిత్స పొందుతున్నాడు. కార్తీక్ ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న శ్రీనివాస్ గార్గే వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందజేశారు. బాన్సువాడ నియోజక వర్గంలో ఎన్నో సేవా కార్యక్ర మాలు చేస్తున్న శ్రీనివాస్ గార్గేకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోగల లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో ఈ నెల 16 నుండి 22 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సత్యనారాయణ వ్రతం ఆచరించి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో మహిళా మణులు, యువతి యువకులు, వీడిసి సభ్యులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన

- అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి, గుమ్మిర్యాల్, ఏర్గట్ల ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంకింద జరుగుతున్న పనులను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. పనులను ఈ నెల 30 లోగా పూర్తి చేయించాలని గ్రామ సంఘం వివోఏలు, ప్రధానోపాధ్యా యులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ ఆంధ్రయ్య ఎంపీఓ శివ చరణ్, సీసీ సంతోష్ ఉన్నారు.


పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బాలామృతం పంపిణీ


బాలామృతం అందజేస్తున్న సూపర్‌వైజర్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి ఖానాపూర్ గ్రామాల మధ్య ఇటుక బట్టీల్లో నివసిస్తున్న వారికి గర్భిణీలకు, బాలింతలకు, 5సంవత్సరాల్లోపు పిల్లల తల్లులను బుధవారం సందర్శించడం జరిగిందని పిప్రి గ్రామ సెక్టార్ సూపర్వైజర్ వెంకట రమణమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. బాలా-మృతం, ఐరన్ టాబ్లెట్లు, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అజీమా, ఆశ వర్కర్, అ-మృత, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ


ధర్పల్లి : జీలుగ విత్తనాలు అందజేస్తున్న అధికారులు

నవతెలంగాణ-ధర్పల్లి/మాక్లూర్

మండలంలోని రామడుగు, ధర్పల్లి సొసైటీ పరిధిలోని రైతులకు కావలసిన జీలుగు విత్తనాలు 60శాతం సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల ఇంచార్జి ఏఓ వెంకటేష్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన ధర్పల్లి సొసైటీలో రైతులకు జీలుగ విత్తనాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రెండున్నర ఎకరాలకు ఒక బ్యాగు చొప్పున రైతులు అందించడం జరుగుతుందని అన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టా పాసు బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ సంబంధిత సొసైటీ అధికారులకు అందించి సబ్సిడీ జీలుగును పొందాలని అన్నారు. 30 కిలోల బస్తా రూ.1116కే అందించడం జరుగుతుందని తెలిపారు.

మాక్లూర్ : మండల కేంద్రంలోని సహాయ సహకార సంఘం అధ్వర్యంలో రైతులకు జిలుగు విత్తనాలు పంపిణీ బుదవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి రంజిత్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై జిలుగు విత్తనాలను ఇవ్వడము జరుగుతుందని, రైతు 30కిలోల బస్తాకు రూ. 1116 చెల్లించి, పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకొని రావాలని, 2.20 ఎకరాలకు ఒక బస్తా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అశోక్, హెడ్ క్లర్క్ విజయ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మాక్లూర్ : జీలుగ విత్తనాలు అందజేస్తున్న అధికారులు

కార్యదర్శిపై విచారణకు ఆదేశం

- అక్రమ పర్మిషన్, పన్నుల దుర్వినియోగంపై ఫిర్యాదు రావడంతో స్పందించిన డిపీవో

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య 2022-23 సంవత్సరంలో వాణిజ్య, గృహ నిర్మాణాలలో అక్రమ అనుమతులు, పన్నుల దుర్వినియోగం చేసి లక్షల రూపాయలు గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొట్టారని, పలు అక్రమాలకు పాల్పడ్డారని మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ వసీం ఇటీవల డిపిఓ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డిపిఓ స్పందిస్తూ గత పంచాయతీ కార్యదర్శిపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. ఈ విషయమై బాల్కొండ పంచాయతీలో ఈనెల 24న విచారణ నిర్వహించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

టీయూ పరిధిలో స్కిల్ ఎన్ హన్స్‌మెంట్ కోర్స్

- పరీక్షల షెడ్యూలు విడుదల


నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో స్కిల్ ఎన్ హన్స్‌మెంట్ కోర్స్ రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు బుధవారం విడుదల చేశారు. గ్రూప్- ఏ కళాశాలలో 16- 5- 2024 నుండి 31-5-2024 వరకు గ్రూప్ -బి కళాశాలలో 25-6-2024 నుండి 31-5-2024 లోపు నిర్వహించుకొని మార్కులను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలంగాణ విశ్వవిద్యాలయం వెబ్సైట్లో పొందుపరిచామని కంట్రోలర్ పేర్కొన్నారు.

ఆల్ ఇండియా ఇంటర్ ఇన్‌స్టిట్యూట్ క్యారమ్స్ టోర్నమెంట్



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్


టోర్నమెంట్‌కు సిద్ధమైన హాల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నేటినుండి ఈనెల 26 వరకు నిజామాబాద్‌లోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌లో స్వర్ణోత్సవ వేడుకలు-ఆల్ ఇండియా ఇంటర్ ఇన్‌స్టిట్యూట్, వెటరన్ నేషనల్ (పురుషులు, మహిళలు) టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా క్యారం ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యారమ్ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆల్ ఇండియా ఇంటర్ ఇన్‌స్టిట్యూట్ టోర్నమెంట్, నేషనల్ వెటరన్ టోర్నమెంట్ స్త్రీ పురుషులు ఈనెల 23 నుండి 26వ వరకు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆల్ ఇండియా క్యారమ్ ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న దాదాపు 20 ప్రసిద్ధ సంస్థలు పాల్గొంటున్నాయని అన్నారు. ప్రతి సంస్థ నుండి ఆరుగురు పురుషులు, ఆరుగురు మహిళలు ఇలా 150 నుండి 200 మంది పాల్గొంటున్నారు అని అన్నారు. వెటరన్ మెన్ అండ్ ఉమెన్ నేషనల్స్‌లో ప్రతి రాష్ట్రం నుండి ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళా క్రీడాకారులు దాదాపు 100 మంది పాల్గొంటున్నారని చెప్పారు. వచ్చిన క్రీడాకారులకు, అధికారులకు లాడ్జింగ్, బోర్డింగ్ సదుపాయం కల్పించామని అన్నారు. తెలంగాణకు చెందిన క్యారమ్ అసోసియేషన్ ద్వారా ఆల్ ఇండియా క్యారమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నామని, క్యాట్ ప్రెసిడెంట్ కె.సంతోష్ కుమార్, వైస్ చైర్మన్‌గా నిజామాబాద్‌లో హౌస్ట్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభన్ రాజ్, జీఏస్ క్యాట్, ట్రెజరర్, ఏఐసిఏఫ్ టోర్నమెంట్ వైస్ చైర్మన్ ఎస్.మదనరాజ్, జనరల్ సెక్రటరీ భారతి నారాయణ్ ఈ సమావేశంలో హాజరయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రధాన స్పాన్సర్‌గా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పరికరాలు మీడియా పార్ట్‌నర్లుగా సిన్కోడ్ సహకారం అందిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా 350 నుండి 400 మంది భారీ బృందంతో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ఈ క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందిన ఛాంపియన్లు, ప్రపంచ, జాతీయ, ఆసియా ఛాంపియన్‌లతో సహ భారతదేశం నుండి అగ్రశ్రేణి క్రీడాకారు లు పాల్గొంటున్నారని అన్నారు. స్వర్ణోత్సవం సందర్భంగా మొదటి సారిగా తెలంగాణలో కార్యక్రమం నిర్వహించబడుతుందని, తెలంగాణ క్యారమ్ అసోసియేషన్ జూబ్లీ సెలబ్రేషన్ నిర్వహిస్తున్నామని అన్నారు.

అనుమతి ఉన్న పాఠశాలల్లో అడ్మిషన్ పొందాలి : డిఇఓ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అడ్మిషన్ చేసుకునే ముందు తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయంలో తెలుసుకున్న తర్వాతనే అనుమతి ఉన్న పాఠశాలలో అడ్మిషన్ పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ వి దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లలోని ఏదేని పాఠశాలలో ప్రవేశము తీసుకొనే ముందు ఆ పాఠశాలకు అనుమతి ఉన్నది లేనిది సంబదిత మండల విద్యాధికారి కార్యాలయంలో తెలుసుకొని ప్రవేశం పొందాలని ఇదివరకే తెలియచేశామని పేర్కొన్నారు. నిభందనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేస్తున్న పాఠశాలలని గుర్తించి వాటిని మూసి వేసేందుకు తగు చర్యలు తీసుకోవలసిందిగా, జిల్లాలోని మండల విద్యాదికారులకు సూచించామని తెలిపారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా అనుమతి పొందకుండా ప్రవేశాలు తీసుకొంటున్న పాఠశాలలని గుర్తించి ఆ పాఠశాల ప్రచార బోర్డ్ లను, బ్యానర్ లను ఇది వరకే తొలగించామని పేర్కొన్నారు. ఈ విషయమై కొన్ని పత్రికల్లో అధికారులు కొద్ది రోజులు నామ మాత్రపు తనిఖీ చేసి ముడుపులు తీసుకొని మమ అనిపిస్తున్నారని వచ్చిన వార్తలు అవాస్తవమని, ఆ పాఠశాలలను ఇది వరకే గుర్తించి మూసివేయడం జరిగిందని తెలిపారు. ఇంకా ఏవైన పాఠశాల ఉన్నట్లయితే వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని, ఏదైనా పాఠశాల షిఫ్టింగ్, ప్రారంభ అనుమతి కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే, వాటిని పరిశీలించి పై అధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిభందనలకు విరుద్దంగా ప్రవేశాలు, వేసవి శిక్షణా తరగతులు, పాఠశాల ఆవరణలో బెల్ట్‌లు, యూనిఫారంలు అమ్మకాలు చేయవద్దని తెలిపారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు పుస్తకాల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద 70 శాతం ఫీజును ముందే చెల్లించాలని విద్యార్థుల తల్లి దండ్రులను భయభ్రాంతులను గురి చేస్తున్నారని, ఇలాంటివి తమ దృష్టికి వచ్చినట్లైతే ఎటువంటి నోటీసు జారీ చేయకుండా ఆ పాఠశాల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

నూతన కమిటీని ఎన్నుకోవాలని వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉన్నా.. నూతన కమిటీని ఎన్నుకోలేదని, త్వరగా ఎన్నుకోవాలని కోరుతూ.. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యకులు మెతుకు శివకుమార్ ఆధ్వర్యంలో కోటగిరి మండలం రాంపూర్ గ్రామానకి చెందిన మత్స్యకారులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేయలేదని, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటుకోసం 2016 నుండి నేటి వరకు సుమారు 8 సంవత్సరాల కాలం అవుతున్న, ఇప్పటివరకు నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేయలేదని అన్నారు. 8 సంవత్సరాల కాలంలో అనేక ఇబ్బందులతో ముదిరాజులు, చేపల వృత్తిపై ఆధారపడుతూ వారి వృత్తి నైపుణ్య పరీక్షను త్రిసభ్య కమిటీ సమక్షంలో పూర్తిచేసుకుని తొమ్మిది నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో రాంపూర్ ముదిరాజ్ మహాసభ, ముదిరాజ్ మత్స్యకారులు, ఎన్. భూమయ్య, డి. కృష్ణ, సిహెచ్ సాయిలు, డి.సాయిలు, డి. భాస్కర్ పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

వరిపై బోనస్ అందించాలి

- సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. జూన్ మాసంతో ఎంపిటిసి, జెడ్పిటిసిల పదవి కాలం పూర్తి కానున్నందున ఇదే చివరి సమావేశం కానున్నది. ఎంపీపీ నల్ల సారిక అధ్యక్షతన బుధవారం ప్రారంభమైన సమావేశంలో ముందుగా ఇటీవల మృతి చెందిన మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులు అర్పించి మౌనం పాటించారు. అనంతరం ప్రారంభమైన సభలో ఆయా శాఖల అధికారులు ఆయా విభాగాల్లో జరుగుతున్నా పనులను వివరించారు. అనంతరం అకాలవర్షంతో నానిన వరితోపాటు ప్రభుత్వం దొడ్డు, సన్నాలు అని కొర్రీలు లేకుండా వరికి బోనస్ అందించి రైతులకు ఇచ్చిన హామీని నిలిబెట్టుకోవాలని సభలో తీర్మానం చేసి ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బాలకృష్ణ, తహసీల్దార్ మాలతీ, ఏపిఓ రాజేష్, వైస్ ఎంపిపి కల్లెడ నవీన్ రెడ్డి, ఎంపిటిసిలు పెండ గంగాధర్, లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మజీద్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులను వేధిస్తున్న టేకేదార్

- మహిళలకు రక్షణ కల్పించాలని చార్బై ఖార్ఖానా ఎదుట మహిళల నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి


ఖార్ఖానా ఎదుట నిరసనలో పాల్గొన్న బీడీకార్మికులు

ఇందల్ వాయి మంల కేంద్రంలోని గ్రామంలో చార్బాయి కార్ఖానాకు సంబంధించిన టేకేదార్ మహిళలను దూషిస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ బెదిరిస్తూ తాను చెప్పిందే వినాలంటూ బెదిరిస్తున్నారని మహిళలు ఆందోళన చెంది బుధవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 కు అనుకుని ఉన్న చార్ బాయి బీడీ సెంటర్ కార్యాలయాన్ని ముట్టడించారు. టేకేదార్ పైన యాజమాన్యం, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని మహిళలకు రక్షణ కల్పించాలని వారు కోరారు. మరోపక్క ఈ టేకేదారును తప్పించి వేరే వ్యక్తిని నియమించాలని కోరుతూ బీడీ సెంటర్‌లో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అంతకు ముందు బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. టేకేదార్‌పై చర్యలు లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

ముగ్గురు డిబార్

- డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని(సి బి సి ఎస్) బిఎ, బీకాం, బీఎస్సీ, బిబిఏ కోర్సులకు రెండవ, నాలుగవ ఆరవ, సెమిస్టర్, రెగ్యులర్ ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలు యూనివర్సిటీ పరిధిలో 38 సెంటర్లలో రెండవ రోజు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఉదయం జరిగిన పరీక్షకు 9109 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 8337 మంది విద్యార్థులు హాజరయ్యారని, 772 మంది విద్యార్థులు హాజరు కాలేదని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 8,020 మంది విద్యార్థులకు 7,493 మంది విద్యార్థులు హాజరయ్యారని, 527 మంది విద్యార్థులు హాజరు కాలేదని పేర్కొన్నారు. ఉదయం జరిగిన పరీక్షలో సిఎస్ఐ డిగ్రీ కాలేజ్ నిజామాబాద్ ఒకరు డిబార్ కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షలో జిడిసి డిగ్రీ కాలేజ్ ధర్పల్లిలో ఇద్దరు డిబార్ అయ్యారని తెలిపారు. మిగిలిన పరీక్ష కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ పేర్కొన్నారు.

20, 30తేదీల్లో స్థాయి సంఘ సమావేశాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 29, 30న నిర్వహించనున్నట్లు సీఈవో బి.ఉష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఉదయం 11 గంటలకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మధ్యాహ్నం 2 గంటలకు విద్య, వైద్యం, మహిళా, శిశు సంక్షేమం, 30న ఉదయం 11 గంటలకు సాంఘిక సంక్షేమం, పనులు, ఆర్థిక, ప్రణాళికపై సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రుణమాఫీకి సీఎం మొదటి ప్రాధాన్యత

- ఎన్‌డిసిసిబి అధ్యక్షులు రమేష్ రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయుటలో ముఖ్యమంత్రి మొదటి ప్రాధాన్యత ఇచ్చారని ఎన్డిసిసిబి అధ్యక్షులు రమేష్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంక్ అధ్యక్షులు కుంట రమేష్‌రెడ్డిని మండలంలోని కొలిప్యాక్ సింగిల్ విండో అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం రమేష్ రెడ్డి శాలువాతో సన్మానిస్తూ పుష్పగుచ్ఛమిస్తూ అభినందించారు. రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయుటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గకి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి, ఎన్డిసిసిబి అధ్యక్షులు రమేష్‌రెడ్డికి నాగుల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు.


రమేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొలిప్యాక్ విండో అధ్యక్షులు

డిగ్రీ పరీక్షల్లో 772 మంది గైర్హాజరు

- విధుల్లో అలసత్వం.. అబ్జర్వర్ తొలగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ 2,4,6 సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఉదయం 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. వర్సిటీ పరిధిలో బోధన్లోని మిమ్స్ కళాశాలలో విధుల్లో అలసత్వం వహించిన అబ్జర్వర్ పి.శ్రీకాంత్‌ను విధుల నుంచి తప్పించి తక్షణమే అక్కడ కొత్తవారిని నియమించారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ ఆతిక్ సుల్తాన్ ఘోరీలు బోధన్, కామారెడ్డిలోని పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. వివిధ రూట్లలో నాలుగు ప్రత్యేక స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించాయి.

గంజాయి కేసులో 9 మంది రిమాండ్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామ శివారులోని నాగేంద్రుని మర్రి చెట్టు వద్ద ఈ నెల 21న గంజాయి పీలుస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ రహమాన్, ఎండి.అజార్, ఎస్.కె.శంషేద్, ఎస్.కె.షమీర్, వంశి వర్ధన్, ఎండి.సలీం పాషా కమ్మర్‌పల్లి మండలానికి చెందిన ఎండి.ఆరిఫ్ ఇంటికి చుట్టంగా వచ్చారని అన్నారు. తాళ్ళ రాంపూర్ గ్రామ శివారులో గల నాగేంద్రుని మర్రి వద్ద గంజాయి తాగుతుండగా పట్టుకున్నామని తెలిపారు. వారిని విచారించగా నిర్మల్‌కు చెందిన అన్ను (షేక్ షాదుల్లా హుస్సేన్), సయ్యద్ అజారుద్దీన్‌ల వద్ద నుండి కొని తాగుచున్నామని తెలిపారు. పట్టుబడిన వారి నుండి 268 గ్రాముల ఎండు గంజాయి, స్కార్పియో వాహనం, ఏడుసెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని 9 మందిని రిమాండ్‌కు తరలించామన్నారు. మండలంలో ఎవరైనా గంజాయి అమ్మినా కొని పీల్చినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫోన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు

- ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు విద్యార్థులు మొబైల్ ఫోన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలోని భర్తీకి ఈనెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. www.ts model schools.comలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

పడుకున్న చోటే పేలిన సెల్‌ఫోన్

- కాలిపోయిన బెడ్ షీట్
- తప్పిన పెను ప్రమాదం


పేలిపేయిన ఫోన్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో కొమ్మొల్ల యోగేష్ మంగళవారం రాత్రి పడుకొని టీవీ చూస్తుండగా సెల్ ఫోన్ పేలడంతో భయాందోళనకు గురయ్యారు. సెల్ ఫోన్ పేలి మంటలు రావడంతో పిల్లలను తీసుకొని బయటికి పరిగెత్తి వెంటనే మంటలను ఆర్పి వేశారు. రెడ్ మీ నోట్ 10 సెల్‌ఫోన్ పేలడంతో ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గడ్డివాములు దగ్ధం

నవతెలంగాణ-కామారెడ్డి డెస్క్

పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం తండాలో బుధవారం ప్రమాదవశాత్తు మంటలంటుకొని గడ్డివాములు, రెండు ఎడ్ల బండ్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. పోచారం తండాకు చెందిన బన్సిలాల్ తన పశువులకు మేత నిమిత్తం తెచ్చుకున్న గడ్డిని గ్రామ సమీపంలోని గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నాడు. అయితే వాటికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో రెండు గడ్డివాములతో పాటు అక్కడే ఉన్న రెండు ఎడ్ల బండ్లకు నిప్పంటుకుంది. ఇది గమనించిన స్థానికులు మంటలార్పడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని యజమాని కంటనీరు పెట్టుకున్నాడు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ
- ప్రభుత్వాసుపత్రుల పనితీరుపై సుదీర్ఘ సమీక్ష
- వైద్య సేవల పటిష్టత కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు, బోధన్, ఆర్మూర్ హాస్పిటళ్ళ పనితీరుపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కూలంకషంగా చర్చించారు. స్థానిక జీజీహెచ్ ఆసుపత్రిలో ఆయా విభాగాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సమస్యలను పరిశీలించిన జిల్లా పాలనాధికారి, సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వైద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో విభాగం వారీగా ఆయా ఆసుపత్రులలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మెరుగుపర్చేందుకు అవసరమైన సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత, డాక్టర్ల ఖాళీల భర్తీ గురించి ఆయా విభాగాల అధిపతులు కలెక్టర్ దష్టికి తెచ్చారు. ఆసుపత్రుల్లో రోగులు, వారి వెంట ఉండే అటెండెంట్ల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జీజీహెచ్‌లో ప్రతి రోజు సగటున అవుట్ పేషంట్లు ఎంత మంది వస్తున్నారు, ఆసుపత్రిలో ఇన్ పేషేంట్లుగా చేరుతున్న వారి సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా, వివిధ విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలు ఏ విధంగా ఉన్నాయి తదితర అంశాలను సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దష్టికి తెచ్చారు. అనునిత్యం సుమారు 1000 నుండి 2000 మంది వరకు ఓ.పీ నమోదవుతుండగా, ప్రతిరోజూ సగటున 100 నుండి 300 మంది వరకు ఇన్ పేషంట్లు ఆసుపత్రిలో అడ్మిట్ అవుతున్నారని అన్నారు. రాష్ట్రంలోనే మరెక్కడా లేని విధంగా జీజీహెచ్ లో ఉచితంగా కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని, 2023 సంవత్సరంలో 83 సర్జరీలు చేశామని తెలిపారు.

సిజీరియన్ కాన్పులను 75 శాతం నుండి 35 శాతానికి తగ్గిస్తూ సాధారణ కాన్పులు జరిగేలా కషి చేస్తున్నామని అన్నారు. అయితే ఆప్తాల్మిక్ వంటి పలు విభాగాలలో వైద్యుల కొరత నెలకొని ఉందని, ఇతర విభాగాల్లోనూ టెక్నీషియన్లు, సిబ్బందిని భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ కు నివేదించారు. ఎం.ఆర్.ఐ, అదనంగా మరో ఐదు ఎక్స్ రే యంత్రాలు అందుబాటులో ఉంటే రోగులకు సత్వరమే మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుందని తెలిపారు. కాగా, అందుబాటులో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


పాల్గొన్న వైద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు





నగరంలో భారీ వర్షం

- భారీ ఉరుములు, మెరుపులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీనికి తోడు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మాడ పగిలే ఎండ ఉంది. దాంతో ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించినా.. ఇబ్బందులు సైతం ఎదురయ్యాయి. ఈదురుగాలులకు అక్కడక్కడ విద్యుత్ అంతరాయం నెలకొంది.

9న పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నిజామాబాద్ జిల్లా పద్మశాలి మహిళ సంఘం ఆధ్వర్యంలో జూన్ 9న జిల్లా కేంద్రంలోని ఖలీల్ వాడి తిలక్ గార్డెన్ న్యూ అంబేద్కర్ భవన్ లో పద్మశాలి వధూవరుల పరిణయ-పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పద్మశాలి వధూవరుల పరిణయ పరిచయ వేదిక చైర్మన్ గుజ్జ రాజేశ్వరి తెలిపారు. పెళ్లి సంబంధాలు అవసరం ఉన్నవారు బయోడేటా, ఫొటో, పూర్తి చిరునామాతో సంప్రదించాలని ఆమె కోరారు. పరిణయ పరిచయ వేదికలో పాల్గొనదలచిన వారు నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హనుమాన్లు, ఫోన్ నెంబర్ 9396483999, నగర పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జేటి వెంకట నరసయ్య, ఫోన్ నెంబర్ 9985566374, పద్మశాలి వధూవరుల పరిణయ పరిచయ వేదిక చైర్మన్ గుజ్జ రాజేశ్వరి, ఫోన్ నెంబర్ 9346645161, బింగి మోహన్ 9866603879, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి అధ్యక్షులు రాపల్లి గురు చరణం, ఫోన్ నెంబర్ 9866557115, జిల్లా మహిళా పద్మశాలి సంఘం అధ్యక్షులు గుడ్ల చంద్రభాగ, ఫోన్ నెంబర్ 9848229322, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు మెరుగు నాగరాజ్, ఫోన్ నెంబర్ 95732 32778 సంప్రదించాలని కోరారు. ఉదయం 9:30 గంటలకు పరిణయ పరిచయ వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

మద్నూర్ డివిజన్‌గా మారేనా..?

- ఒకప్పుడు తాలూకా
- ఎన్నికల వ్యవహారాలన్నీ ఇక్కడే

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రం పాత తాలూకా కేంద్రం దీనిని డివిజనల్ కేంద్రంగా ఏర్పాటుకు గుర్తింపు లభించేనా అనే విషయంపై ప్రజల్లో జోరుగా చర్చలు వినబడుతున్నాయి. ఒకప్పుడు తాలూకా కేంద్రం ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు ఉన్న కాలంలో తాలూకా కేంద్రాలకు విభజించి మండల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒకప్పుడు మద్నూర్ తాలూకా కేంద్రం ఉండగా దాని పరిధిలో ప్రస్తుతం ఐదు మండలాలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో తాలూకా కేంద్రం ఉండగా.. ప్రత్యేక రాష్ట్రంలో కెసిఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా కొత్త జిల్లాలు, కొత్త డివిజనల్ కేంద్రాలు, కొత్త మండలాలు ఏర్పాటు చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగినా, పార్లమెంట్ ఎన్నికలు జరిగినా, మద్నూర్ మండల కేంద్రంలోనే ఎన్నికల ఏర్పాట్లు జరుగుతాయి. అసెంబ్లీ ఎన్నికలకు మద్నూర్ మండల కేంద్రంలోనే నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఇక పార్లమెంట్ ఎన్నికలు వస్తే జిల్లా కేంద్రాల్లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగినప్పటికీ జుక్కల్ నియోజకవర్గంలో ఎన్నికలు ఏర్పాట్లు అన్నీ మద్నూర్ పాత తాలూకా కేంద్రంలోనే అధికారులు నిర్వహిస్తారు. ఇక్కడ ఎస్‌టిఓ కార్యాలయం ఉండటం తాలూకా పరిధిలోని మండలాలన్నీ ఈ ఎస్‌టిఓ పరిధిలోనే కావలసిన నిధులు లభిస్తాయి. జుక్కల్ నియోజకవర్గంలో డివిజనల్ కేంద్రం లేకపోవడం.. కొత్తగా డివిజనల్ కేంద్రం ఏర్పాటు కోసం బిచ్కుంద మండల కేంద్రాన్ని డివిజనల్ కేంద్రంగా ఏర్పాటు చేయడానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా పాత తాలూకా కేంద్రాన్ని మరిచి డివిజనల్ కేంద్రం ఏర్పాటులో బిచ్కుంద మండలానికి ప్రస్తుత ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్టు తెలిసింది.

డివిజనల్ కేంద్రంగా మద్నూర్ పాత తాలూకా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మద్నూర్ మండల ప్రజలు కోరుతున్నారు. మద్నూర్ మండల కేంద్రం పూర్తిగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్నందున ఈ మండలం డివిజనల్ కేంద్రంగా మారిస్తే పక్క రాష్ట్రాలకు అభివృద్ధి పథంగా ఉంటుందని, మూడు రాష్ట్రాలకు సరిహద్దులో డివిజనల్ కేంద్రం ఉంటే గుర్తింపు ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మద్నూర్ మండలం అభివృద్ధి చెందాలంటే డివిజనల్ కేంద్రంగా ఏర్పాటు చేయడమే ముఖ్యమని డివిజనల్ కేంద్రంగా ఏర్పడితే అభివృద్ధికి నోచుకుంటుందని ప్రజలు కోరుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు మద్నూర్ పాత తాలూకా కేంద్రాన్ని కొత్తగా డివిజనల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

24న ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు 24న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఈఓ సుందర వరదరాజన్ ఆధ్వర్యంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికకు మండలంలోని మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

వీరులను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థులు స్వామి వివేకానందను, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లాంటి వీరులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఏబీవీపీ కామారెడ్డి జిల్లా ప్రముఖ బి.ఎస్.గిరి అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామారెడ్డి నగర శాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్ ముగింపు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని శిశు మందిర్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ముఖ్య అతిథిగా నోడల్ ఆఫీసర్ షేక్ సలాం, ఆర్యభట్ట గ్రూప్స్ ఆఫ్ కాలేజ్ ఇంచార్జ్ గురువేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కామారెడ్డి జిల్లా కన్వీనర్ చరన్, జిల్లా హాస్టల్ కన్వీనర్ కలీం, కార్యకర్తలు రోహిత్, అల్తాఫ్, వెంకి, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ స్కీములపై ప్రజలకు వివరించాలి

- బిపిఎంలకు ఒకరోజు శిక్షణ


మాట్లాడుతున్న పోస్టల్ అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

తపాల శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల బీపీఎంలకు ఏఎస్పీవోస్, ఎంవోల ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో మీటింగ్ హాల్లో జిల్లా ఎస్ఎస్పీ జనార్ధన్ రెడ్డి, పట్టణ ఏఎస్పీ భూమన్న యం.వోలు చంద్రశేఖర్, దశరథ్ బీపీఎంలకు తపాలశాఖ స్కీములు ఎస్బీలు, ఆర్డీలు, సుకన్య సమృద్ధి యోజన, పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ, యాక్సిడెంట్ పాలసీలు ఇచ్చిన టార్గెట్‌ను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. విధులు నిర్వహిస్తున్న గ్రామాలలో ప్రజలతో మమేకమై నూతన పోస్టల్ స్కీములు, వడ్డీ రేట్లపై ప్రజలకు అర్థంచేయించి, మెప్పించి ఒప్పించి అకౌంట్లను, పాలసీలను చేయించాలన్నారు. ఒక్కొక్క బీపీఎం నుండి వ్యక్తిగతంగా సమాచారం సేకరించాలన్నారు. జిల్లా ఎస్ఎస్పీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. మీ మీ గ్రామాలలో ఉదయాన్నే ప్రజలు గుమి గూడే కూడలి ప్రదేశాలకు వెళ్లి అక్కడ పోస్టల్ శాఖకు సంబంధించిన స్కీములపై చర్చించాలన్నారు. ఇక్కడున్న ప్రజలకు అవగాహన కల్పించి అకౌంట్లు, పాలసీలు చేయడానికి ప్రోత్సహించాలన్నారు. ఈ మధ్య డివిజన్ స్థాయిలో విశిష్ట సేవలు అందించిన బీపీఎంలకు బుద్ధ పౌర్ణమి రోజు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిపిన బీపీఎంలను పేరుపేరునా అభినందించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల బీపీఎంలు, డివిజన్ తపాలశాఖ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,స్టేట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ లింబాగౌడ్ బీపీఎంలు వెంకట్ రమణ, ఎర్రటి శ్రీనివాస్, వెంకటేష్, రవీంధర్,ముత్తెన్న,రాజేష్, వేణు గోపాల్,సత్య నారాయణ సృజన, భావన,శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నా కుమార్తె జాడ తెలపండి

- ఓ తండ్రి విన్నపం
- పోలీసులు ఫిర్యాదు స్వీకరించడం లేదని ఆవేదన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలం లోని గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన రావుట్ల సుజాత (22)ను శ్రీపాద లింబాద్రి అనే వ్యక్తి కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన పోలీసులు ఫిర్యాదును స్వీకరించడం లేదని అమ్మాయి తండ్రి రావుట్ల రాజన్న బుధవారం చెప్పారు. గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన రాజన్న కుమార్తె సుజాత నిజామాబాద్‌లోని ఒక కళాశాలలో డిగ్రీ చదువుతుంది. 7 మార్చి 2024 నాడు కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి సుజాత ఇంటి నుంచి వెళ్లిందన్నారు. ఇంటి నుంచి వెళ్లిన సుజాతను అదే గ్రామానికి చెందిన వివాహితుడైన శ్రీపాద లింబాద్రి అనే వ్యక్తి కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడన్నాడని ఆరోపించారు. ఆయని తమ్ముడు శ్రీనివాస్, తల్లి యమున, సోదరి పద్మ సహాయ సహకారాలతో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారన్నారు. తమ కుమార్తె అదృశ్యమైన తర్వాత లింబాద్రి కుటుంబ సభ్యులు గ్రామం నుంచి వెళ్లిపోయారన్నారు. లింబాద్రి ఫోన్ సైతం స్విచ్ ఆఫ్ లో ఉందన్నారు. అయితే మొదట తమ కుటుంబ సభ్యులు కోటగిరి సంజీవ్‌పై అనుమానపడి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆ తర్వాత తమకు శ్రీపాద లింబాద్రి అనే వ్యక్తి సుజాతను తీసుకెళ్లినట్లు తెలిసిందన్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేయడానికి రాగా పోలీసులు దరఖాస్తును తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 రోజుల నుంచి ఫిర్యాదు స్వీకరించాలని స్టేషన్ చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడంలేదని చెప్పారు. తమ అమ్మాయి సుజాతను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన లింబాద్రి తో పాటు సహకరించిన వారిపై కేసు నమోదు చేసి విచారణ జరపాలన్నారు. తన కుమార్తె జాడను కనిపెట్టి తీసుకొని రావాలని ఆయన వేడుకొన్నారు. అసలు తన కుమార్తె జీవించి ఉందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా పోలీసులు తన ఫిర్యాదును స్వీకరించి విచారణ జరిపి కేసు నమోదు చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న రావుట్ల రాజన్న